ఒక్కరోజులోనే తత్కాల్ పాస్‌పోర్టులు

22 రోజుల నుంచి 6 రోజులకు తగ్గిన బుకింగ్

నిరుడు ప్రతీరోజూ 4,200 దరఖాస్తులు • 9.02 లక్షల దరఖాస్తులకు 7.97 లక్షలు జారీ

గ్రీవెన్స్‌లో 10 వేల ఫిర్యాదులకు పరిష్కారం • హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ స్నేహజ

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 3(నమస్తే తెలంగాణ): పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియను మరింత వేగవంతం, సులభతరం చేశామని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ వెల్లడించారు. సాధారణ పాస్‌పోర్ట్‌కు వారం గడువుండగా, తత్కాల్ పాస్‌పోర్ట్‌ను ఒకటి నుంచి మూడు రోజుల్లోనే జారీ చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో పలు వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని, సికింద్రాబాద్ రీజినల్ పరిధిలోని పీఎస్కే, పీవోపీఎస్కేలలో రోజూ 4,200 పాస్‌పోర్ట్ దరఖాస్తులను ప్రాసెస్ చేస్తున్నామని తెలిపారు. 2024లో 9.02 లక్షల దరఖాస్తులను పరిశీలించగా, వాటిలో 7.97 లక్షల మందికి పాస్‌పోర్టులను జారీ చేశామని వివరించారు. ఈ దరఖాస్తులోనే పాస్‌పోర్ట్ జారీ, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో పాటు ఇతర సంబంధిత సేవలున్నాయని తెలిపారు. మనదేశంలోనే పాస్‌పోర్ట్ సేవల వినియోగంలో హైదరాబాద్ రీజనల్ పాస్‌పోర్ట్ కేంద్రం ప్రముఖంగా ఉన్నదని, రాబోయే రోజుల్లో వర్షన్-2 ద్వారా మరింత మెరుగైన సదుపాయాలు కలిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

తగ్గిన నిరీక్షణ.. వేగంగా పాస్‌పోర్ట్ జారీ

సికింద్రాబాద్ రీజినల్ పరిధిలోని పాస్‌పోర్ట్ కేంద్రాల్లో పాస్‌పోర్ట్‌ల జారీ ప్రక్రియ అత్యంత వేగవంతంగా జరుగుతున్నదని స్నేహజ తెలిపారు. గతంలో సాధారణ పాస్‌పోర్ట్ స్లాట్‌బుకింగ్‌కు 22 రోజులు, తత్కాల్‌కు 5 నుంచి 7 రోజుల సమయం పట్టేదని, ఇప్పుడు చాలా తక్కువ సమయంలో పాస్‌పోర్ట్ స్లాట్‌బుకింగ్ అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. సాధారణ పాస్‌పోర్టును కేవలం 5 నుంచి 7 రోజుల్లో జారీ చేస్తున్నామని, తత్కాల్ దరఖాస్తులకు మరునాడే ఇస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ రీజినల్ పరిధిలోని 5 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో అపాయింట్‌మెంట్ సైకిల్ 2023లో 22 రోజులుంటే 2024లో ఆరు నుంచి ఎనిమిది పనిదినాలకు తగ్గించామని తెలిపారు. 14 పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లో వారం లోపే పాస్‌పోర్ట్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నదని తెలిపారు. నిజామాబాద్, కరీంనగర్ పీఎస్కేలలో సాధారణ అపాయింట్‌మెంట్లు మరుసటి రోజులోనే చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ పీఎస్కేలో మాత్రం సాధారణ అపాయింట్‌మెంట్ 6 నుంచి 8 రోజులు, తత్కాల్ ఒకటి నుంచి ఐదు రోజుల్లో ఉంటాయని తెలిపారు.

గ్రీవెన్స్‌లో 10 వేల ఫిర్యాదుల పరిష్కారం

హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ కేంద్రంలో ఎంక్వైరీ అపాయింట్‌మెంట్ సిస్టమ్‌తో ప్రతీ గురువారం సగటున 700 నుంచి 800 మంది దరఖాస్తుదారులు అంటే ఈ ఏడాది సుమారుగా 30 వేల మంది వాక్‌ఇన్ సదుపాయాన్ని పొందారని హైదరాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జొన్నలగడ్డ స్నేహజ తెలిపారు. గ్రీవెన్స్‌లో ఈమెయిల్స్ ద్వారా 10 వేల ఫిర్యాదులు వచ్చాయని, వాటిని కేవలం రెండు నుంచి మూడురోజుల్లోనే పరిష్కరించామని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని మెరుగుపరచడానికి వీలుగా సోషల్ మీడియా వేదికలతోపాటు వాట్సప్ నంబర్ (918121401532)ను కేటాయించామని, ప్రజలు తమ ఫిర్యాదులను ఈ నంబర్‌లో తెలపాలని కోరారు. గ్రీవెన్స్‌కు సంబంధించి పాస్‌పోర్టు ప్రక్రియలో దళారుల వ్యవస్థను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్రిమినల్ కేసులకు సంబంధించిన పాస్‌పోర్టుల సీజ్ విషయంలో కోర్టు సూచనలను తాము అనుసరిస్తున్నామని, పాస్‌పోర్ట్ చట్టం ప్రకారమే వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. కామారెడ్డి పీవోపీఎస్కే వద్ద ఉన్న మొబైల్ వ్యాన్ సమర్థవంతంగా పనిచేస్తున్నదని, అది ఆ ప్రాంత దరఖాస్తుదారులకు అంతరాయం లేని సేవలను అందిస్తున్నదని తెలిపారు. భారత రాజ్యాంగం 75 ఏండ్ల మైలురాయిని పురస్కరించుకుని, రీజనల్ ఆఫీస్ ప్రత్యేక ఎన్వలప్‌ను ప్రారంభించిందని, దీనిని పాస్‌పోర్ట్ జారీకి వినియోగిస్తామని తెలిపారు. హైదరాబాద్ ఆర్‌పీవో పరిధిలోని అతిపెద్దదైన వరంగల్ పీవోపీఎస్కేలో ప్రతీరోజూ 130 మంది దరఖాస్తుదారులను అందిస్తున్నదని, మిగతా చోట్ల ప్రతీరోజూ 90 దరఖాస్తుదారుల క్యాచ్‌డే ఉన్నట్టుగా ఆమె పేర్కొన్నారు.

పాస్‌పోర్టులు జారీ ఇలా..!

సంవత్సరం	జారీ చేసిన పాస్‌పోర్టులు
2019	5,32,785
2021	4,28,246
2022	6,43,157
2023	7,85,485
2024	7,97,641 (సుమారు)

సికింద్రాబాద్‌లోనే బ్రాంచ్ సెక్రటేరియట్

సికింద్రాబాద్ రీజినల్ ఆఫీసులోనే బ్రాంచ్ సెక్రటేరియట్ ఉన్నదని, ఇది చాలా మందికి తెలియదని స్నేహజ తెలిపారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు, డిపెండెంట్ వీసా దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్ల అటెస్టేషన్ చేయించుకోవడానికి ఢిల్లీ వరకు వెళ్తున్నారని, కానీ హైదరాబాద్‌లోనే రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన బ్రాంచ్ సెక్రటేరియట్ సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ బ్రాంచ్ సెక్రటేరియట్‌లో అటెస్టేషన్, అపాస్టిల్స్ చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకునేవారు రోజురోజుకూ పెరుగుతున్నారని చెప్పారు. నిరుడు 1,400 మంది అటెస్టేషన్, అపాస్టిల్స్ చేయించుకున్నారని తెలిపారు.

సంక్షేమభవన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ, విద్యార్థి సంఘాల నేతలు

దద్దరిల్లిన సంక్షేమ భవన్

- ఫీజు బకాయిలు చెల్లించాలని బీసీ, విద్యార్థి సంఘాల డిమాండ్
- ప్రభుత్వ తీరుపై ఆర్ కృష్ణయ్య ఫైర్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీసీ, విద్యార్థి సంఘాల నేతృత్వంలో వేలాదిమంది విద్యార్థులు మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. వారి నినాదాలతో సంక్షేమ భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో చెల్లించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ 11 నెలల పాలనలో వేలకోట్లు అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నది కానీ, విద్యార్థుల ఫీజులు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. స్కాలర్‌షిప్‌లు పెంచాలని, బకాయిలు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వసతులు కల్పించాలని ఏబీవీపీ ధర్నా..

మరోవైపు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నేతలు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. సంక్షేమ అధికారి చాంబర్ ముందు బైఠాయించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

మంత్రి పొంగులేటి పర్యటనలో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు, మంత్రిని అడ్డుకోకుండా పోలీసుల బందోబస్తు

మంత్రి పొంగులేటికి నిరసన సెగ

భద్రాద్రి కొత్తగూడెంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ప్లకార్డుల ప్రదర్శన • మంత్రిని అడ్డుకోకుండా పోలీసుల పహరా

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : 24రోజులుగా సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు మంత్రి పొంగులేటి పర్యటనకు నిరసనసెగ చూపించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతానగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరై పాల్వంచకు వెళ్తుండగా కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మంత్రిని అడ్డుకొని వినతిపత్రం ఇవ్వాలని చూడడంతో పోలీసులు వారిని రోడ్డు మీదకు రాకుండా కట్టడి చేశారు. దీంతో సర్వశిక్ష ఉద్యోగులు జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయకత్వంలో రోడ్డుపక్కన నిల్చొని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. తర్వాత మంత్రి పొంగులేటికి వినతిపత్రాన్ని అందజేశారు.

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లి రైతు వేదిక వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మల్లంపల్లి రైతు వేదిక వద్ద రైతుల ధర్నా

రూ. రెండు లక్షలపై రుణమాఫీ చేయాలని డిమాండ్

అక్కన్నపేట, జనవరి 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక తమను మోసం చేసిందని శుక్రవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లి రైతు వేదిక వద్ద రైతులు నిరసన తెలిపారు. వారికి బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు, సింగిల్ విండో డైరెక్టర్ మ్యాక నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ముత్తినేని వేణుగోపాల్‌రావు మద్దతు తెలిపారు. రెండు లక్షలపై ఉన్న రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో తమను మోసం చేసిందని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా 2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత నిబంధనలు, షరతులు, కొర్రీలు పెడుతూ తూతూమంత్రంగా రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో నేటికీ రుణమాఫీ కానీ రైతులు ఉన్నారని చెప్పారు. రైతు భరోసా ఇవ్వక పోవడంతో పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు బోనస్ ఇవ్వకుండా కాలం గడిపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

మంత్రి సీతక్క, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్

రవీంద్రభారతి, జనవరి 3: సావిత్రీబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రవీంద్రభారతిలో సావిత్రీబాయి పూలే 194వ జయంత్యుత్సవాల కమిటీ చైర్మన్ మణిమంజరి అధ్యక్షతన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతక్క, మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పూలే విగ్రహాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సావిత్రీబాయి ఆశయాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పూలే జయంతి అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని పేర్కొన్నారు.

కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

6న విచారణకు రావాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : ఫార్ములా-ఈ కేసులో విచారణకు హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నోటీసులు జారీచేసింది. ఈ నెల 6న ఉదయం 10 గంటలకు తమ ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కేటీఆర్‌తోపాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డిని కూడా రావాలని పేర్కొంది. ఏసీబీ నోటీసులకు స్పందించే విషయంలో కేటీఆర్ న్యాయనిపుణులను సంప్రదించి నిర్ణయం తీసుకోకున్నట్టు తెలిసింది. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. తీర్పు వెలువడే వరకూ కేటీఆర్‌పై ఎటువంటి చర్యలూ తీసుకోవద్దని ధర్మాసనం ఏసీబీని ఆదేశించింది. అయినప్పటికీ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు ఇచ్చింది. ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఈ నెల 7న విచారణకు రావాలని కేటీఆర్‌ను ఆదేశించింది. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి (ఏ3)లకు కూడా నోటీసులు జారీ అయ్యాయి.

మా పోస్టింగ్స్ ఎప్పుడిస్తరు?

- ప్రజాభవన్‌లో బైటాయించిన డీఎస్సీ 2008 బాధితులు
- మరోవైపు వీఆర్ఏల వారసుల నిరసన
- రాత్రివరకు కొనసాగిన ఆందోళనలు



ప్రజా భవన్ ఎదుట బైటాయించిన డీఎస్సీ 2008 బాధితులు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్ శుక్రవారం ఆందోళనలతో దద్దరిల్లింది. తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డీఎస్సీ 2008 బాధితులు, వీఆర్ఏల వారసులు నిరసనలు చేపట్టారు. రాత్రి వరకు ఆందోళనలు కొనసాగాయి. కోర్టు ఆదేశాల మేరకు డీఎస్సీ-2008లో నష్టపోయిన బాధితులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. విధివిధానాల ఖరారు బాధ్యతను మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుతో కూడిన సబ్ కమిటీకి అప్పగించింది. సబ్ కమిటీ సూచన మేరకు నిరుడు సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించారు. రెండు వారాల్లోగా నియామక పత్రాలు ఇస్తామని చెప్పి, మూడు నెలలు గడుస్తున్నా పోస్టింగ్స్ ఇవ్వలేదంటూ సుమారు 200 మంది అభ్యర్థులు శుక్రవారం ప్రజాభవన్‌కు తరలివచ్చారు. ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పలు మార్లు చర్చలు జరిపినా అభ్యర్థులు పట్టువీడలేదు. సీఎం రేవంత్‌రెడ్డితో తాను వ్యక్తిగతంగా మాట్లాడుతానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. దీంతో రాత్రి 7 గంటలకు డీఎస్సీ 2008 అభ్యర్థులు ఆందోళన విరమించారు. మరోవైపు.. 61 ఏండ్లు దాటిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, జీవో 81ను అమలు చేయాలని వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాభవన్‌కు తరలివచ్చారు. జీవో 81 ప్రకారం 3,797 మందికి ఉద్యోగాలు రావాల్సి ఉన్నదని చెప్పారు.

- వారంలోగా జాబ్ క్యాలెండర్ ఇవ్వాలి

వారంలోగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్వరమే 2 లక్షల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వానికి వారంగడువు ఇస్తున్నామని స్పష్టంచేశారు. ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో శుక్రవారం నిరుద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరుద్యోగులు మెయిన్ లైబ్రెరీ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు ప్లకార్డులు చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం మోతీలాల్‌నాయక్ మాట్లాడారు. వారంలోగా జాబ్ క్యాలెండర్‌తోపాటు డిగ్రీ అర్హతతో 12 వేల వీఆర్వో ఉద్యోగాలు, డిప్లొమా ఇన్ సివిల్ అర్హతతో డిప్యూటీ సర్వేయర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

-ఉస్మానియా యూనివర్సిటీ

సంక్రాంతిలోగా పదోన్నతులు

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, జనవరి 3 (నమస్తేతెలంగాణ) : సంక్రాంతిలోగా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందికి పదోన్నతులు కల్పిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ అగ్రిడాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి, అగ్రిడాక్టర్స్ డైరీ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పదోన్నతులు లేకపోవడంతో వ్యవసాయాధికారులు నిరుత్సాహంగా ఉన్నట్టు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

- సీఎం ముఖ్య కార్యదర్శికి సర్పంచ్‌ల జేఏసీ వినతి

పెండింగ్ బిల్లులు చెల్లించేలా చొరవచూపాలని సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం సచివాలయంలో సీఎం ముఖ్య కార్యదర్శి అజిత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఏడాది గడిచినా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు కేశబోయిన మల్లయ్య, గూడూరి నవీన్‌కుమార్, గణేశ్, నెమలి సుభాశ్‌గౌడ్, బొల్లం శారద, శానబోయిన శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, వంగాల శంకర్, ఎట్టబోయిన శీను పాల్గొన్నారు. – హైదరాబాద్

- పట్టాలు ఇవ్వకుంటే నిరాహార దీక్ష

గతంలో ఎంపిక చేసిన 392 మంది లబ్ధిదారులకు సోమవారంలోగా డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇవ్వకుంటే అంబేద్కర్ సెంటర్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మొండి వైఖరిని నిరసిస్తూ శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. -కృష్ణ కాలనీ

- డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాల కోసం ధర్నా

డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి, రాజీవ్‌నగర్, ఇల్లిపూర్, రామేశ్వర్‌పల్లి, నర్సన్నపల్లి తదితర కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి మాట్లాడారు. ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి వచ్చి వారం రోజుల సమయం ఇవ్వాలని, సిబ్బందిని ఇంటింటికీ పంపి ఫొటోలు, వివరాలు సేకరిస్తామని, ఆ తర్వాత పట్టాలు ఇస్తామని చెప్పడంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు. – కామారెడ్డి

అంగన్‌వాడీల్లోనూ గంట మోగించాలి

అధికారులు చర్యలు తీసుకోవాలి : సీతక్క • అంగన్‌వాడీల పనితీరుపై అధికారులతో సమీక్ష

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ) : పాఠశాల్లో మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ ఉదయం 9 గంటలకు గంట మోగించాలని, అందుకు సంబంధించి జిల్లా వెల్ఫేర్ అధికారులు(డీడబ్ల్యూవోలు) చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అంగన్‌వాడీల పురోగతి, పనితీరుపై శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు సొంతభవనాల నిర్మాణం, తాగునీటి కనెక్షన్లు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం పనికిరాదని సూచించారు. అంగన్‌వాడీల్లో పోషకాహారాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, నాసిరకం వస్తువులు వస్తే వెంటనే తిరిస్కరించి, పంపిణీదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు.. బడిబాట మాదిరిగానే అంగన్‌వాడీబాట పట్టాలని సూచించారు. కొన్ని జిల్లాలో మూతబడిన అంగన్‌వాడీలను తక్షణమే తెరిపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బంద్రు శోభ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, వయోవృద్ధులు వికలాంగుల సాధికారత శాఖ జేడీ శైలజ, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

5 లోగా సీఆర్టీలకు జీతాలు..

రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల(సీఆర్టీలు)కు ప్రతి నెలా 5 లోగా జీతాలు విడుదల చేయనున్నట్టు మంత్రి సీతక్క తెలిపారు. మహిళా టీచర్లకు 180 రోజులు ప్రసూతి సెలవులతోపాటు డెత్ బెనిఫిట్స్ మంజూరు చేస్తామని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం సెక్రటేరియట్‌లో సీఆర్టీలతో చర్చలు జరిపారు.

సంచార చేపల విక్రయ వాహనాల అందజేత

సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో ఆమె చిత్రపటానికి మంత్రి సీతక్క నివాళి అర్పించారు. అనంతరం 25 మంది లబ్ధిదారులకు సంచార చేపల విక్రయ వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సర్కారు అందజేస్తున్న వాహనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.